ప్రజాశక్తి
బుధవారం 31 జులై 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కుసులవాడలో మైనింగ్‌తో తీవ్ర నష్టం మార్గ 2లో..

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు 20 నామినేషన్లు మార్గ 2లో..

స్పా, మసాజ్ సెంటర్లపై పోలీసుల ఆకస్మిక దాడులు మార్గ 2లో..

సరుకు రవాణా, కాలుష్యంపై
పోర్టులో నేడు ప్రత్యేక భేటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విశాఖలో పారిశ్రామిక కాలుష్యంపై జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కొన్ని అంశాలను లేవనెత్తి పర్యావరణ సమస్యలపై ప్రసంగించిన నేపథ్యంలో బుధవారం విశాఖ పోర్టులో సరుకు రవాణా లావాదేవీలు, కాలుష్యంపై ప్రత్యేక భేటీ నిర్వహిస్తున్నారు. నగర జనంపై కాలుష్య ప్రభావం పడుతుందన్న పర్యావరణవేత్తల ఆందోళన తెలిసిందే. దీంట్లో పోర్టు నుంచి వెలువడే కాలుష్యం గాలిలో కలిసి ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగిస్తున్న విషయమూ విదితమే. ఈ క్రమంలో చేపట్టిన భేటీని స్థానిక దక్షిణ ఎంఎల్ఎ వంశీకృష్ణ శ్రీనివాస్ ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. వైజాగ్ పోర్టు సౌత్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉండడంతో గతం నుంచీ ఎంఎల్ఎలు సమీక్షలు జరపడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. పోర్టు అధికారులు ఈ సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేదాంత కంటైనర్ కార్గో బెర్త్ (విసిసిబి), విశాఖ కంటైనర్ టర్మినల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (విసిటిపిఎల్) యాజమాన్యం ఈ సమావేశంలో ప్రధానంగా పాల్గొంటున్నాయి. పోర్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో జరగనున్న ఈ సమావేశంలో జివిఎంసి అధికారులు సైతం పాల్గొననున్నారు. నగరంమీద పరిశ్రమల కాలుష్య ప్రభావంపై స్థానిక ఎంఎల్ఎ ఆరా తీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జివిఎంసి, పోర్టు, ఇతర ప్రైవేట్ బల్క్ కార్గో యాజమాన్యాలు చేపట్టాల్సిన చర్యలపై దీంట్లో సుదీర్ఘంగా చర్చించనున్నారని తెలుస్తోంది. పోర్టు ఆస్తులను పిపిపికి ఇవ్వడంపైనా, ఫలితంగా రేగుతున్న ఆందోళనలపైనా భేటీలో చర్చకు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు 20 నామినేషన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని కమిషనర్ పి.సంపత్ కుమార్ మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ వేసిన వారిలో అక్కరమాని రోహిణి, రొయ్యి వెంకటరమణ, ఇమ్రాన్ మహమ్మద్, జె.బిపిన్ కుమార్ జైన్, ముర్రు వాణి, శరగడం రాజశేఖర్, బొమ్మిడి రమణ, నొల్లి నూకరత్నం, గళ్ల పోలిపల్లి, పిళ్ల మంగమ్మ, బల్ల శ్రీనివాసరావు, లక్ష్మీబాయి పులి, గొలగాని వీరారావు, విల్లూరి భాస్కరరావు, పిసిని వరాహ లక్ష్మీనరసింహం, సాడి పద్మావతి, నక్కెళ్ల లక్ష్మి, తోట పద్మావతి, కరణాడ వెంకట నాగ శశికళ, పల్లా అప్పలకొండ ఉన్నారని తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్క్రూట్నీ జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తవుతుందని, ఆగస్టు 7న ఎన్నికలు నిర్వహించడం, అదే రోజు ఫలితాలను ప్రకటించడం ఉంటాయని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఆ సత్యాన్ని నిత్యం తెలిపేలా విశాఖ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలూ తగు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎంవిపి కాలనీలోని ఎఎస్.రాజా మహిళా విద్యాపీఠం జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు సారథ్యాన విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణలో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల పాత్రపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు, సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు, యువత అధికశాతం మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అంశాలు నిత్యం తమ కమిషన్కు ఫిర్యాదుల రూపంలో అందుతున్నాయని అన్నారు, సమీక్షా సమావేశానికి పూర్తి స్థాయిలో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ హాజరుకాకపోవడంపై కమిషన్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. కార్యక్రమంలో డివిఇఒ బి.రాధ, సిడబ్ల్యుసి ఛైర్పర్సన్ రాధ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో పాల్గొన్న ధీరజ్, తదితరులు

నష్టం జరగలేదు
- మెడికవర్ ఆసుపత్రి ఇన్ఛార్జి ధీరజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం అర్ధరాత్రి మెడికవర్ ఆసుపత్రిలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో రోగులకుగానీ, ఆసుపత్రి సిబ్బందికిగానీ ఎటువంటి ప్రమాదమూ జరగలేదని ఆసుపత్రి ఇన్ఛార్జి ధీరజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంవిపి కాలనీలోగల మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో విద్యుత్కు సంబంధించిన యుపిఎస్ బ్యాటరీలోనుంచి పొగ రావడంతో ఆసుపత్రి సిబ్బంది గుర్తించి జిల్లా అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారన్నారు. పది నిమిషాల వ్యవధిలో వారు ఆసుపత్రికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారన్నారు. తాము ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఎటువంటి అసౌకర్యమూ కలగనీయమన్నారు. తాజా ప్రమాదం మానవీయ కోణంలో జరిగిందా లేదా విద్యుత్ సమస్యల వల్ల ఏర్పడిందా అన్న దానిపై దర్యాప్తు కోరామన్నారు.

కుసులవాడలో మైనింగ్తో తీవ్ర నష్టం

నోటిఫికేషన్ రద్దు చేయకుంటే ప్రతిఘటన తప్పదు : సిపిఎం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ సర్వే నెంబరు 104లో మైనింగ్కు కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ రక్షణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ను తక్షణం రద్దు చేయాలని, ఆ కొండల ధ్వంసానికి పూనుకుంటే ప్రతిఘటన తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. మంగళవారం జగదాంబ దరి సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుసులవాడ భూముల్లో క్వార్ట్జైట్ మైనింగ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎస్ఒ 1533 నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కుసులవాడ సర్వే నెంబరు 104లోగల 69 హెక్టార్లలో 7.991 హెక్టార్లలో రఫ్ స్టోన్ గ్రావెల్, క్వార్ట్జైట్ మైనింగ్కు విఆర్ ఇన్ఫ్రా అండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఆ భూముల్లో సంవత్సరానికి 34,962 ఎం 3 క్వార్ట్జైట్, 1,11,018 ఎం3 రఫ్ స్టోన్ గ్రావెల్ మైనింగ్ చేయడానికి అనుమతించిందని తెలిపారు. అందుకు ఆగస్టు 28న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు సిద్ధపడుతున్నారన్నారు. కొండలు, ప్రకృతిని ధ్వంసం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర ప్రమాదమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియదా ? అని ప్రశ్నించారు. ప్రకృతి సంపదను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. కానీ ఆ ప్రభుత్వాలే ప్రకృతి విధ్వంసానికి పూనుకోవడం అమానుషమన్నారు. కుసులవాడ కొండల ధ్వంసం వల్ల పర్యావరణానికి, ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆ ప్రాంత ప్రజల జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు అపార నష్టం కలుగుతుందని తెలిపారు. పశు సంపద నష్టపోతారని, గాలి, తాగునీరు కలుషితమవుతాయని, కాలుష్య ప్రమాదం పెరుగుతుందని అన్నారు. తుపాను వంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుసులవాడ ఎస్సి కాలనీ, చిన్నయ్యపాలెం ఎస్టి కాలనీ, రేగానిగూడెం, గొల్లలపాలెం, ఇచ్ఛాపురం తదితర గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రుషికొండ, ప్రకృతి ధ్వంసానికి పూనుకొంటే సిపిఎంతో పాటు టిడిపి, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పర్యావరణ కాముకులు, ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తదుపరి వైసిపి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురైందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం కొండలను, పర్యావరణాన్ని కాపాడుతుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారన్నారు. దీనికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం కుసులవాడ కొండల మైనింగ్కు తన అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయడం సరికాదన్నారు. మీడియా సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్కెఎస్వి.కుమార్, సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

రేపే చేతికి పింఛన్ సొమ్ము

- రూ.108.41 కోట్లు విడుదల

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో ఆగస్టు ఒకటిన ఎన్టిఆర్ భరోసా పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇచ్చే పని ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత, అభయహస్తం, మత్స్యకారులు, ఒంటరి మహిళ, గీత కార్మికులు, ట్రాన్స్జండర్, డప్పు కళాకారులు సహ 14 రకాల పింఛన్దారులు 2,61,130 మంది, మెడికల్ పింఛన్దారులు 1494 మంది కలిపి 2,62,624 మంది వున్నారు. వీరికి రూ.108.41 కోట్లు విడుదలైంది. ఈ పింఛన్ సొమ్ము లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ ఉద్యోగులు ఇవ్వనున్నారు. తొలిరోజే పింఛన్ పంపిణీ పూర్తిచేసి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకోవాలన్న కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.శచీదేవి, డిపిఎం పి.వెంకటరమణ పింఛన్ల పంపిణీకి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఆగస్టు ఒకటిన పూర్తిస్థాయిలో పింఛన్ పంపిణీ జరిగేలా అప్రమత్తం చేశారు. తొలిరోజు అనివార్యకారణాలతో ఇవ్వలేని వారికి రెండో తేదిన పింఛన్ అందజేయనున్నట్లు శచీదేవి తెలిపారు.

ఉక్కుపై కేంద్రానికి నివేదిక అందింది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు అన్నారు. మంగళవారం ఉదయం బీచ్ రోడ్లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వారాల క్రితం ఉక్కు మంత్రిత్వ శాఖ స్టీల్ప్లాంట్ను పరిశీలించిందని, అదేవిధంగా మార్చి నెలలో హైపవర్ కమిటీ స్టీల్ప్లాంట్లో పర్యటించి కేంద్రానికి ఒక నివేదికను కూడా అందించిందని ఆయన తెలిపారు. స్టీల్ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తుందని, స్టీల్ప్లాంట్కు సుమారు 3100 కోట్లు పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, అదేవిధంగా ఎన్ఎండిసి నుంచి కొన్ని ఆస్తులు ఇచ్చి 1100 కోట్లు నిధులు సమకూర్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. స్టీల్ప్లాంట్కు కేవలం వర్కింగ్ క్యాపిటల్ సమస్య మాత్రమే ఉందని, అది తీరితే మూడో బ్లాస్ట్ ఫర్నేస్ కూడా వినియోగంలోకి వస్తుందని అన్నారు.

స్పా, మసాజ్ సెంటర్లపై పోలీసుల ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర పరిధిలోని స్పా, మసాజ్ కేంద్రాలలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ముందస్తు సమాచారంతో నగర వ్యాప్తంగా ఉన్న 71 స్పా, మసాజ్ సెంటర్లపై 71 టీములు మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. సుమారు 200 మంది సిబ్బందితో నిర్వహించిన ఈ దాడులలో ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఒక స్పాను గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు మహిళలను పునరావాస కేంద్రానికి తరలించారు. 21 స్పా, మసాజ్ కేంద్రాలను గుర్తించి వారికి నోటీసులు అందజేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింటు అయిన ముప్పిడి శ్రీరాములు దిగువ షెడ్యూలు స్థిరాస్తులకు సంబంధించి ముప్పిడి లక్ష్మీ పై 5వ అదనపు జిల్లా జడ్జి మరియు కుటుంబ న్యాయస్థానంలో దావా నెం. **OP 890/24** వేసియున్నారు. కావున సదరు స్థిరాస్తులను ఎవరైనా కొనుగోలు చేయుటగాని, లీజు చేయుట గాని తనఖా మరియు ఎటువంటి లావాదేవీలు జరుపుట నిషేధించడమైనది. ఆ విధముగా చేసిన యెడల చట్టరీత్యా చర్యలు తీసుకొనబడును.

స్థిరాస్తుల వివరములు:
1. చోడవరం సబ్‌రిజిస్ట్రార్ Doc No. 4423/2018 సర్వేనెం.26-2, 27-1, 166.66 Sq.Yds దుడ్డుపాలెం చోడవరం మండలంలో గల ఖాళీ స్థలము
2. చోడవరం సబ్‌రిజిస్ట్రార్ Doc No. 2953/2019, సర్వేనెం.47, చిన్నప్పన్నపాలెం గ్రామం, బుచ్చయ్యపేట మండలం చోడవరం సబారిలో గల మెట్టభూమి.

పి.రణధీర్,
న్యాయవాది, విశాఖపట్నం.
సెల్: 7989455619

పబ్లిక్ నోటీసు
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్.,
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమసంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం., ABC - CS/006/2015

H .O.: ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521225, Ph: 0866-6650307
BO: ABC-CS, Flat No.F1 HSR Enclave,Opp Andhra Bank, Akkayyapalem, Visakhapatnam - 530016, Ph:0891 -2561655.

ఈ ప్రకటనలోని వారి తాలుకు దిగువ ఉదహరించిన స్థిరాస్థిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై, సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపుగా లిఖిత పూర్వకముగా అభ్యంతరములను రిజిస్టర్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీ కు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Smt. RAYAVARAPU SEETHA MAHA LAKSHMI, GL NO.52298 W/o. Sri. RSRRV Balasubrahmanyam Cell : 9849405481/8121387161 2. Smt. ELAPAKURTHI NAGAMANI, GL No. 62498 S/o. Sri E.Krishnakanth Cell : 8712187411/779944468	The Property in an extent of 107 Sq.Yards in two items (i.e 53.50 Sq.Yards as Item No.1 and 53.50 Sq.Yards as Item No.2), of house site along with RCC roofed residential building therein, in Survey No. 89/3B, Plot No.77, Door No. 18-20-21, Asst. No. 1086303094, Revenue Ward No. 52, Near Vara Siddhi Vinayaka Temple Dairy Colony, Pedagantyada (V & M), Visakhapatnam District-530044 Value Rs. 32.10 Lakhs

Visakhapatnam
30-07-2024
Branch Manager,
SRINIVASA RAO TATA 9281029463/9848141269

కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను ఖండించాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బన్న

ప్రజాశక్తి -గాజువాక : కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను ఖండించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న కోరారు. కెవిపిఎస్ గాజువాక జోన్ నూతన కమిటీ సమావేశం సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ జనాభాలో 4వ వంతు ఉన్న దళిత, గిరిజనుల ప్రస్తావనే లేకుండా కేంద్రప్రభుత్వ బడ్జెట్ రూపొందించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు గురించి, దళిత గిరిజనులలో పెరుగుతున్న నిరుద్యోగం గురించి ఏమీ చెప్పలేదన్నారు. కొంతవరకు దళిత, గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ గురించి మాట్లాడలేదన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.చిరంజీవి మాట్లాడుతూ, గ్రామీణ నిరుద్యోగ్యాన్ని తగ్గించే ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, దళిత, గిరిజన, బలహీన వర్గాల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, కెవిపిఎస్‌ను బలోపేతం చేసి మన హక్కులను కాపాడుకోవాలన్నారు. సోమాదుల గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐద్వా నాయకులు సంతోషం, జివిఎంసి నాయకులు గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బన్న

కమిటీ ఎన్నిక

కెవిపిఎస్ గాజువాక జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.సరోజినమ్మ, ప్రధాన కార్యదర్శిగా సోమాదుల గణేష్, 18 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బి టెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ప్రయివేట్ రెస్టారెంట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి టెక్ విద్యార్థి మతి చెందాడు. అతని స్నేహితునికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్ఐ పైడిరాజు కథనం ప్రకారం... విజయనగరం ఎంవిజిఆర్ కళాశాలలో బి టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విజయనగరం జిల్లా, నెలిమర్ల మండలానికి చెందిన వల్లి సాయి గణేష్ కుమార్ (20), అతని స్నేహితుడు అదే జిల్లా, డెంకాడ మండలం, దొడ్డి గడువ గ్రామానికి చెందిన బి టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి తెలుగు తేజస్ విజయనగరం ఎంవిజిఆర్ కళాశాల నుంచి మోటారు సైకిల్‌పై భీమిలి వచ్చారు. ప్రయివేటు హోటల్ వద్ద మోటారు సైకిల్‌ను సాయి గణేష్ కుమార్ మలుపు తిప్పే క్రమంలో డివైడర్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సాయి గణేష్ కుమార్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని స్నేహితుడు తెలుగు తేజస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ బాధిత బాలునికి ఆర్థిక సాయం అందజేస్తున్న గాడు వెంకటప్పడు

200 మందికి సాయం

ప్రజాశక్తి- తగరపువలస : ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన వివిధ అనాథ శరణాలయాలకు చెందిన 200 మందికి మంగళవారం పలు రూపాల్లో సాయం చేశారు. తగరపువలసలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, అతిథులుగా పాల్గొన్న సింగన బంద సర్పంచ్ జివి.నారాయణ, గాడు తాతినాయుడు, కనకల వెంకటరమణ, జి.ఎల్లయ్య హాజరై సాయం అందజేశారు. సంస్థ నిర్వాహకులు సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటప్పడు మాట్లాడుతూ, 150 మంది అనాథలకు, 20 మంది వికలాంగ విద్యార్థులకు, అనారోగ్యం కారణంగా ఇబ్బందులు పడుతున్న మరో 20 మందికి ఆర్థిక సాయంతో పాటు యూనిఫాం, స్కూల్ బ్యాగ్‌లు, బియ్యం, నిత్యావసరాలు, చీరలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. అధిక మొత్తంలో ఆర్థిక సాయం పొందిన వారిలో కిడ్నీ వ్యాధి బాధితుడైన 16 ఏళ్ల బాలుడు ఉన్నాడు.

శాకాంబరిగా బబ్బెమ్మ అమ్మవారు

ప్రజాశక్తి -మధురవాడ : కారుషెడ్ కూడలి వద్ద ఉన్న బబ్బెలమ్మ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పాత పోతినపాలెం నుంచి అమ్మవారికి ఆషాఢం సారె పట్టారు. ఈ కార్యక్రమంలో పోతిన శ్రీను, పోతిన బాలాజీ, పోతిన సూర్యారావు, పోతిన నాయుడుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం ప్రాంగణంలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి ఆషాఢ మాసం బహుళ పక్షం దశమి మంగళవారం సందర్భంగా నిత్య అర్చనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పాల్గొన్నారు.

కృష్ణాపురం ఏటి కాలువ నీరు విడుదల

ప్రజాశక్తి -పద్మనాభం: కృష్ణాపురం గ్రామానికి సంబంధించి ఏటి కాలువ నీరు మంగళవారం విడుదల చేశారు. ఈ కాలువ పూడికతీత పనులు గత నెల రోజుల నుంచి గ్రామ సర్పంచ్ ఎం.అప్పలనాయుడు ఆధ్వర్యాన చేశారు. పొట్నూరు పంచాయతీ పరిధిలో ఉన్న గోస్తనీ నది సమీపాన ఏటి గట్టు కాలువలోకి విడుదల చేసి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీటిని విడుదల చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు

జి ప్యాట్ పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ద్వారా బి ఫార్మసీ అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జిప్యాట్ తదితర పోటీ పరీక్షలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి శాస్త్రవేత్త నాయుడ తేజ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిప్యాట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి దేశంలోని ప్రముఖ విద్యాలయాలలో ఎం.ఫార్మసీ ప్రవేశంతో పాటు నెలకు రూ.12,400 స్టైఫండ్ లభిస్తుందని తెలిపారు. జిప్యాట్ విద్యార్థులు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాకాలజీ, ఫార్మకోగ్నోసీలలో ప్రవేశం పొందవచ్చని వివరించారు. జిప్యాట్ ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల కెరీర్‌కు ఉపయోగపడుతుందని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రధాన అర్హతగా పరిగణిస్తారని తెలిపారు. జిప్యాట్ పరీక్షకు ఎలా సిద్ధం అవ్వాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్‌రణ్ దాస్ అధ్యక్షత వహించగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ విరుద్ధంగా పాలన'

ప్రజాశక్తి -మధురవాడ : రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆరోపించారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చాక వ్యక్తిగత కక్షలతో దాడులు పెరిగాయన్నారు. మంచి పరిపాలన అందిస్తారని ప్రజలు అధికారం కట్టబెడితే దాడులకు దిగడం సరికాదన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి అమలుచేయలేని అనేక హామీలిచ్చారని ఆరోపించారు. పథకాలకు పేర్లు మార్చుకున్నంత మాత్రాన అభివృద్ధి చేసినట్లు కాదన్నారు. మత్స్యకార భరోసా కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారన్నారు. ఉచిత ఇసుక పేరిట ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పార్టీని ఎంతమంది వీడినా వచ్చిన నష్టమేమీ లేదన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.వేణుగోపాల్‌ను ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా, నూర్ భాషా, ఖాన్ సాహెబ్ షేక్ సాహుల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాలువతో సత్కరించారు. పెందుర్తి మండలంలో పలు ప్రభుత్వ భూములు కబ్జా గురవుతున్నాయని, వాటి మీద దృష్టి సారించాలని తహశీల్దార్‌ను షఫీ కోరారు.

ప్రజలకు సేవలందించడం ఆనందంగా ఉంది

వేములవలస గ్రామ కార్యదర్శి నరసింగరావు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రజలకు సేవలందించడం ఆనందంగా ఉందని వేములవలస గ్రామ కార్యదర్శి పురము నరసింగరావు పేర్కొన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ప్రజాశక్తితో ఆయన పలు విషయాలు పంచుకున్నారు. అనకాపల్లి గవరపాలెంలో జగన్న, జోగులమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు ఆడపిల్లలు కాగా చివరి సంతానంగా తాను జన్మించినట్లు నరసింగరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని 1986లో అనకాపల్లి టౌన్ టిడిపి వైస్ ప్రెసిడెంట్‌గా మూడేళ్ళు, 1989 -91 వరకు గౌరీ పిఎసిఎస్ డైరెక్టర్‌గా పనిచేసినట్లు వివరించారు.

స్నేహితుల ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు సిద్ధమైనట్లు నరసింగరావు తెలిపారు. తన స్నేహితుడు ఆర్ శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి మంచి పుస్తకాలు పంపించే వారని వివరించారు. 1997లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై విడిఒ ఉద్యోగం సాధించినట్లు చెప్పారు. మొదటిసారిగా అనంతగిరిలో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శిగా ప్రమోషన్‌పై మునగపాక మండలం తోటాడ బదిలీ అయినట్లు వివరించారు. అక్కడ 2001 నుంచి 2004 వరకు పనిచేశానని చెప్పారు. 2004 నుంచి 2013 వరకు ఆనందపురం మండలం తర్లువాడలో ను, 2013 నుంచి 2015 వరకు పద్మనాభ మండలం రేవిడి గ్రామపంచాయతీలోనూ, 2016 నుంచి 2019 వరకు భీమిలిలోనూ, 2019 నేటి వరకు వేములవలస గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు.

కుటుంబ నేపథ్యం

1998లో విశాఖపట్నానికి చెందిన పారుపిల్లి నిర్మలజ్యోతిని వివాహం చేసుకున్నానని, తమకు పాప అంజలి, బాబు జోగేంద్రకుమార్ ఉన్నారని తెలిపారు. పాపకు వివాహమైందని, బాబు ఇంజనీరింగ్ చదువుతున్నాడని పేర్కొన్నారు.

రైతు కుటుంబంలో పుట్టిన నరసింగరావు అన్నయ్యలు చంద్రరావు సిఆర్‌పిఎఫ్, శివరావు ఒడిశా ఎలక్ట్రిసిటీ బోర్డు పరిధి భువనేశ్వర్‌లో, అక్క సత్యవేణి సిఆర్‌పిఎఫ్ ఉద్యోగిగా పనిచేశారని తెలిపారు. ఉద్యోగ విరమణ సహజమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపడానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

కెజిబివి రోడ్డు పునర్నిర్మాణానికి అంచనాలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో ఉన్న కెజిబివికి వెళ్లే రహదారి పునర్నిర్మాణానికి జివిఎంసి నిధులు రూ.45 లక్షలతో అంచనాలు తయారు చేసినట్లు ఎఇ ఎ.సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. 'రాళ్ళ తేలిన రహదారి' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బడ్జెట్ అనుమతులకు లోబడి పరిపాలనా పరమైన ఆమోదం పొందిన పిదప టెండర్లు పిలిచి రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.సుమన్ తెలిపారు.

ఘనంగా గరే గురునాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -మధురవాడ : కెవిఆర్ క్యాటరింగ్ అధినేత, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ జన్మదిన వేడుకలు ఆరో వార్డు పరిధి ఆర్‌హెచ్.కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి సత్యనారాయణ, పెంటకోట బబ్బేలు, కొప్పాక రామకృష్ణ, కొరగంజి సూరిబాబు, కొల్లి బాబ్జి, అబ్దుల్ భాష, కంచర్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గురునాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నేతలు

బ్లాక్ ఫిలిం ఉంటే సీజ్ చేస్తాం

ప్రజాశక్తి -ఆనందపురం: కార్లకు, ప్రయాణికులను తీసుకుపోవు ఇతర వాహనాలకు బ్లాక్ ఫిలిం ఉంటే కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజారత్నం తెలిపారు. బోయపాలెం పరిసర ప్రాంతాల్లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర మోటార్ వాహనాల నియమాలు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వాహనాలకు బ్లాక్ ఫిలిం, మరి ఏ ఇతర ఫిలిం ఉండకూడదన్నారు. బ్లాక్ ఫిలిం ఉంటే వెంటనే తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ఎన్ఎస్‌టిఎల్, బోయపాలెం, పి.ఎం.పాలెంలో చేసిన ప్రత్యేక తనిఖీల్లో బ్లాక్ ఫిలిం ఉన్న 23 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయించాలని, సాధారణ ఉత్పత్తికి తగినట్లు ఎన్‌ఎండిసి, సెయిల్ ద్వారా రా మెటీరియల్ సమకూర్చాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 1265వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఐఎన్‌టియుసి ప్రతినిధులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్లాంటు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని, వర్కింగ్ క్యాపిటల్ లేక రా మెటీరియల్ కొనుగోలు చేయలేక ఉత్పత్తి పూర్తిగా పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

జివిఎల్ వాదన అర్థరహితం : పోరాట కమిటీ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం కష్టమని రాజ్యసభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు ప్రకటించడం తెలుగు ప్రజలను వంచించడమేనని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. రూ.28 వేల కోట్లు టర్నోవర్, రూ.900 కోట్ల నికర లాభాలు ఆర్జించిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మెడపై కత్తిపెట్టి, ఆంక్షలు విధించి కేవలం మూడున్నరేళ్లలో రూ.5000 కోట్ల నష్టాలకు నెట్టిన బిజెపి ప్రభుత్వం సెయిల్ విలీనంపై వక్ర భాష్యం చెప్పడం దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఎల్లాయి స్టీల్‌ప్లాంట్, భద్రావతి విశ్వేశ్వరయ్య ఇస్పాత్ నిగం లిమిటెడ్, బొకారో స్టీల్ ప్లాంట్, మహారాష్ట్ర ఎలక్ట్రో స్మెల్టర్ నిగమ్ లిమిటెడ్, చంద్రపూర్ మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో ఉన్న ఉక్కు పరిశ్రమలను సెయిల్‌లో విలీనం చేసిన కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు వచ్చేసరికి అవాంతరాలు ఉన్నట్లుగా చెప్పడం తెలుగువారి పట్ల వివక్షత చూపడమేనన్నారు. ఈ దీక్షా శిబిరంలో బి.ఎన్.రాజు, రమణమూర్తి, రాజేశ్వరరావు, దాసరి శ్రీనివాస్, మూర్తి, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

'స్టీల్' కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ మూడు గేట్లు వద్ద స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు మాట్లాడుతూ, సకాలంలో జీతాలు చెల్లించాలని, ఇఎస్ఐ లేని కార్మికులకు వైద్య సౌకర్యం యాజమాన్యం కల్పించాలని, ఎన్‌జెసిఎస్‌లో పెంచిన రూ.1200 వెంటనే అమలు చేయాలని, కార్మికుల తొలగింపు ఆలోచనను విరమించు కోవాలని తదితర డిమాండ్లతో మూడు రోజుల పాటు మూడు గేట్లు వద్ద ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో అన్ని హెచ్‌ఒడి కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. అప్పటికీ యాజమాన్యం దిగి రాకపోతే ఆగస్టు నెలలో చలో అడ్మిన్ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, యు.సోమేష్, చట్టి నర్సింగరావు, పి.మసేను, వరహాలు, పి.నారాయణ, సూర్యకుమార్, కె.సత్యవతి, శశిభూషణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరల్డ్ క్లాస్ వర్సిటీగా ఎయును తీర్చిదిద్దాలి

ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఎయును తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ అన్నారు. మంగళవారం ఏయూను సందర్శించిన ఆయన పాలక మండలి సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఎయు ఇంచార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ, నైపుణ్యాలను విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగంలోనూ ఇండస్ట్రీ ల్యాబ్స్‌ను స్థాపించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్న శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని తెలిపారు. ప్రవేశాల విధానం, ప్రక్రియ, వార్షిక కాలెండర్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన, విభాగాలు, ప్రాజెక్టులు, సిఇఒల పనితీరును పరిశీలించడానికి వచ్చానన్నారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా వీటిలో భాగస్వాములైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షులు ఆచార్య పి.ఉమామహేశ్వరిదేవి, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్స్ జి.గిరిజాశంకర్, ఎంవిఆర్.రాజు, కె.సీతామాణిక్యం, పద్మశ్రీ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-లీగల్ : ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఒకరు మృతిచెందిన కేసులో ఇద్దరి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తీర్పు చెప్పారు. ఈ గొడవను ప్రోత్సహించిన మూడో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదనలు వినిపించిన కాంద్రేగుల జగదీశ్వరరావు కథనం ప్రకారం... పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన నిందితులు సంబంగి వెంకట్ ఎ1, సంబంగి నాగరాజు ఎ2 లు అదే గ్రామానికి చెందిన మంగళగిరి పెంటయ్య కుటుంబంతో 2017లో గొడవపడ్డారు. నిందితులు పెంటయ్య తమ్ముడు బంగారయ్యతో గొడవపడి కొడుతుండగా పెంటయ్య, అతని కుమారుడు చిన్నారావు అడ్డుకున్నారు. నిందితులు పెంటయ్య, చిన్నారావుపై కూడా దాడి చేసి కర్రలతో కొట్టడం వల్ల గాయాలయ్యాయి. గాయాలు పాలైన బాధితులను పద్మనాభం గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పెంటయ్య మృతి చెందాడు. మృతుని కుమారుడు మంగళగిరి దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ వై.కిషోర్ కుమార్ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. దీనిపై విచారణ జరపగా నిందితులపై నేరం రుజువు కావడంతో సంబంగి వెంకట్, సంబంగి నాగరాజులకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.11 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి చెరొక రూ.1,50,000 చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని తీర్పులో వెలువరించారు. ఈ గొడవను ప్రోత్సహించిన మూడో ముద్దాయి కానిస్టేబుల్ సంబంగి గౌరి మృతుని కుటుంబానికి రూ.2.50 లక్షలు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

నేడు ఇఇ ప్రసాద్‌బాబు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెవిఎన్ఎన్‌వి ప్రసాద్‌బాబు బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 1962 ఆగస్టు 1న చీపురుపల్లిలో జన్మించిన ప్రసాద్‌బాబు 1978 సంవత్సరంలో 10వ తరగతి పాస్ అయ్యారు. 1981వ సంవత్సరంలో గరివిడి దుర్గ కాలేజీలో ఇంటర్, 1981 నుంచి 1984 వరకు వైజాగ్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ డిప్లమో పూర్తి చేశారు. తర్వాత ఆంధ్ర యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1987వ సంవత్సరంలో జివిఎంసిలో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. 2002వ సంవత్సరంలో ఎఇగా, 2011వ సంవత్సరంలో డిఇగా, 2021లో ఇఇగా ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్నారు. రెండుసార్లు కలెక్టర్ ద్వారా, ఆరుసార్లు మేయర్ ద్వారా ఉత్తమ ఉద్యోగి అవార్డులు అందుకున్నారు. విశాఖపట్నంలో జివిఎంసి తలపెట్టిన మేజర్ ప్రాజెక్టులను ఆయన సర్వీసులో పూర్తిచేశారు. డ్రెయినేజీలు పూర్తి చేశారు. ఎర్రగెడ్డ, గంగులగెడ్డ, ఎస్ఎల్.కెనాల్ వంటి ఏరియాలో జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కింద వచ్చిన నిధులు సక్రమంగా ఖర్చు చేసి వాటిని అభివృద్ధి చేశారు. సర్వీస్ కాలం మొత్తం ఎలాంటి రిమార్కు లేకుండా దిగ్విజయంగా పూర్తి చేశానని ఆయన తెలిపారు.

ప్రసాద్‌బాబు దంపతులు

నేడు సనపల శంకరరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -మాధవధార : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జనరల్ ఫోర్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న సనపల శంకరరావు బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. మాధవధార ప్రాంతంలో సనపల మాధవస్వామి రామాయమ్మ దంపతులకు శంకరరావు జన్మించారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మాధవధార జివిఎంసి హైస్కూల్లో పూర్తి చేశారు. విశాఖ ఐటిఐలో ఫిట్టర్ పూర్తిచేశారు. 1993వ సంవత్సరంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో మెటలర్జి పూర్తి చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో సిఐటియు సభ్యులుగా ఉంటూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మాధవధార ప్రాంతంలో మాధవధార స్టీల్‌ప్లాంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా 15 సంవత్సరాలు పాటు సేవలందించారు. మూడు సార్లు అధ్యక్షులుగా పనిచేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సంఘం ద్వారా పేద విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో స్నేహబంధం అనే సంఘంలో సభ్యులుగా ఉంటూ అనాధాశ్రమ పిల్లలు, పేదల విద్యను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయాన్ని చేసే విధంగా కృషి చేశారు. శ్రీ మాధవ యువజన సమాజం సహాయ కార్యదర్శిగా పనిచేశారు. మాధవధార గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మాధవధార గ్రామంలో అసోసియేషన్ తరపున ఏర్పాటుచేసిన కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. మాధవధార గ్రామంలో నిర్వహించే మాధవ యువజన సమాజం వార్షికోత్సవాలు, గ్రామ దేవత పండగలులలో పాల్గొని మాధవధార గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని శంకరరావు తెలిపారు. శంకరరావు, వెంకటలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సిపాన స్రవంతి బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు. అల్లుడు సిపాన పృథ్వీరాజ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. చిన్న కుమార్తె హరిని గీతం కళాశాలలో బీఎస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ చదువుతున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి : పల్లా

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గం సభ్యులు మంగళవారం పల్లా శ్రీనివాసరావును సీతంపేటలోని ఆయన ఇంటి వద్ద కలిశారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో గాజువాక ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై తమ ప్రభుత్వ హయాంలో తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు. అర్హులైన జర్నలిస్టులందరికీ మేలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జనార్దన్, అధ్యక్షులు బి.రవికాంత్, గౌరవ సలహాదారు ధవలేశ్వరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట ముత్యమాంబ అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి కుశాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులు కూనిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం, బాలమృతంతో పాయసం ఎలా చేయాలో వివరించారు. బాలమృతంలో ఉండే పోషకాల గురించి తెలిపారు. ఆకుకూరలు, పప్పు చెక్కలు, నువ్వు ఉండలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-పెందుర్తి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత సూచించారు. చినముసిడివాడ తదితర ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల సమస్య ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వస్తుందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సిఎస్ డాక్టర్ హనీషా, సచివాలయ హెల్త్ సెక్రటరీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- విశాఖపట్నం : విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం, మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదులు వైద్య పరీక్షలు పొందారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ నరేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సుధాకర్, కోశాధికారి అశోక్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీ కర్రి మాధవీలత, ఓమ్ని హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎన్.సంతోష్ కుమార్, ప్రముఖ న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని నాలుగో పట్టణ లా అండ్ ఆర్డర్ సిఐ ఎస్.విజయకుమార్ కోరారు. అక్కయ్యపాలెంలోని నారాయణ టెక్నో స్కూల్‌లో లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడం, గంజాయి, మైనర్ డ్రైవింగ్ తదితర విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు.

మాధురి ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-మునగపాక
అచ్యుతాపురం బ్రాండిక్స్ ఎస్ఇజెడ్‌లోని తాన్ యాన్ గార్మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్న నక్క మాధురి ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అరబుపాలెం శివారు ఒంపోలు పేట ఎస్‌సి కాలనీలో నక్కమాధురి కుటుంబాన్ని సిఐటియు నాయకులు మంగళవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం వేధింపులకు తాళలేక మాధురి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. ఆమె ఆత్మహత్య విషయం తెలిసిన వెంటనే కంపెనీలోని కార్మికులంతా ఆందోళన నిర్వహించారని, మాధురి వలె అనేక మందిని వేధింపులకు గురవుతున్నట్లు వీడియోలు, మెసేజ్‌లు పంపారని తెలిపారు. బ్రాండిక్స్ అపరల్ సిటీలో ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నా బయటకు రాకుండా చేస్తున్నారన్నారు. మాధురి జాయిన్ అయిన 4 రోజులకే వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం చూస్తుంటే కంపెనీ లోపల కార్మికులు నరకాన్ని చూస్తున్నారన్న అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. దీనిపై లేబర్ ఆఫీసర్లు తనిఖీలు చేయాలని, పోలీసు అధికారులు వెంటనే కేసు నమోదు చేసి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, కోశాధికారి వివి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రావి దేముళ్ళ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

వికలాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

ఫిజియో థెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కశింకోట : వికలాంగ విద్యార్థులు ఫిజియో థెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ -2 సూర్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు ఫిజియో థెరపీని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, రామునాయుడు, ఉపాధ్యాయులు బివి. రమణమ్మ, దీపా, ఫిజియో థెరపిస్టు గీత మోనికా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డైట్ చైర్మన్ రత్నాకర్

డైట్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 మొదటి సంవత్సరం క్లాస్‌వర్క్ ప్రారంభోత్సవం సందర్భంగా ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన స్వాగత ఉపన్యాసం చేస్తూ, విద్యా నైపుణ్యం, వ్యక్తిగత ఎదుగుదల, సమాజ బాధ్యతలపై సంస్థ నిబద్ధతను నొక్కి చెప్పారు. క్రమశిక్షణ, అప్పగించిన పనుల పట్ల నిబద్ధత విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు అకడమిక్ విధానాలు, క్యాంపస్ వనరులపై వివరించారు. డీన్ అకడమిక్స్ ఎ.కృష్ణ నాగ్ క్యాంపస్ సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేశారు. బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ హెచ్ఓడి డాక్టర్ పి.పవిత్ర మాట్లాడుతూ విద్యాపరమైన అనుభవాన్ని విద్యాపరమైన వృద్ధిని పెంపొందించడానికి సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

అర్హులందరికీ గృహాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్హులందరికీ గృహాలు దక్కుతాయని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి నాయకులు రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనుకకు నెట్టేసిన పరిస్థితులలో కూటమి అధికారం చేపట్టిందన్నారు. ప్రభుత్వ ఖజానాలో ఒక్క రూపాయి లేకుండా గత పాలకులు చేశారని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొంపా సత్యనారాయణ, మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వసంత కుమార్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూరిశెట్టి శ్రీనివాస్, సునీత, ఉమా మహేష్, గాయత్రి, దేవుడమ్మ, ముఖేష్, నాగేశ్వరరావు, శిరీష, గణపతి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పని చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించిన గ్రామాలకు లక్ష రూపాయలు నగదు బహుమతి అందిస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు 500 మెజారిటీ వచ్చిన మండలంలోని వాకపల్లి గ్రామానికి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్ నాయుడు సోమవారం లక్ష రూపాయలను గ్రామ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలు గుర్తించి ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాజీ జెడ్‌పిటిసి పోతల పాత్రు నాయుడు, టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో డ్రైనేజీ, కల్వర్టు, సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. గాంధీ పార్క్, బాలాజీ నగర్, ద్వారక నగర్, జర్నలిస్ట్ కాలనీలో డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ మెటీరియల్ పనుల్లో భాగంగా నియోజకవర్గానికి రూ.20 కోట్ల నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, ఎంపిటిసి నాయుడు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, పంచాయతీ ఈవో నారాయణ రావు, వార్డు సభ్యులు తానవరపు శ్రీను, నేమాలహరి, టిడిపి, జనసేన నాయకులు సకరు కోటేశ్వరరావు, మూలు నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశ్రాంత నన్నయ వర్సిటీ మాజీ ఉప కులపతి ముర్రు ముత్యాలు నాయుడు అన్నారు. మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులతో సత్కరించారు. గ్రామానికి చెందిన నరసింహారాజు పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పాచిల లోష్ణవి, జి తరుణ్, కష్టంరాజులకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4 వేలను నగదు బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె.సత్యనారాయణ డివిడి ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం బోకం సన్నిబాబు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ రాజేష్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మాయిలు జాగ్రత్తతో వ్యవహరించాలి

ప్రజాశక్తి-చోడవరం : నేటి సమాజంలో అమ్మాయిలు జాగ్రత్తతో వ్యవహరించాలని మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని చోడవరం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జి స్వర్ణ అన్నారు. ప్రపంచ మానవ అక్రమరవాణా దినోత్సవం సందర్భంగా మంగళవారం పాలిటెక్నిక్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతికపరంగా అభివృద్ధి చెందుతున్న దానిని ఉపయోగించుకుని మోసగాళ్లు అమ్మాయిలను వలలో వేసుకుంటున్నారని, దీంతో నమ్మిన ఎంతోమంది మోసపోతూ బాధితులుగా మిగులు తున్నారని పేర్కొన్నారు. పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటంతో మహిళలపై దాడులు, హింసకు గురిచేయడం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ లెక్చరర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నేతలు

ఘనంగా మలసాల కుమార్ రాజా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్ సోదరుడు, యువజన నాయకులు మలసాల కుమార్ రాజా జన్మదిన వేడుకలు రింగ్ రోడ్డు వైసిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కటింగ్ చేసి పేదవారికి మలసాల కుమార్ రాజా చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవిందు, నాయకులు జాజుల రమేష్, మలసాల కిషోర్, బొడ్డేడ శివ, కలగా గున్నయ్య నాయుడు, కొణతాల మురళీకృష్ణ, కేఎం నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, గైపూరి రాజు, మున్సూరు శ్రీను, లాయర్ నర్సింగరావు,లగిశెట్టి గణేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

యల్లయ్య కాలువపై రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని ఉడ్‌పేట ప్రాంతంలో గల యల్లయ్య కాలువ మీద రక్షణ గోడ నిర్మాణం చేపట్టి ప్రజలను ప్రమాదాల గురికాకుండా కాపాడాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. యల్లయ్య కాలువ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. గతంలో కాలువను శుభ్రం చేసేందుకుగాను కాలువ మీద గోడను తొలగించిన అధికారులు తరువాత నెలలు గడుస్తున్నా వాటిని ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీని వల్ల కాలువలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

యంత్రాల వాడకంతో ఖర్చులు తగ్గుతాయి

ప్రజాశక్తి-కె.కోటపాడు : వ్యవసాయంలో యంత్రాల వాడకం ద్వారా ఖర్చులు తగ్గి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలోని రొంగలి నాయుడుపాలెం గ్రామంలో కర్రి మనోజ్‌బాబు పొలంలో యంత్రం ద్వారా వరి నాట్లు వేయడాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో విఏఏలు కృష్ణవేణి, సుధీర్ పాల్గొన్నారు.

యంత్రం ద్వారా వరి నాట్లు వేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న జెడి విజయ్‌భాస్కర్

ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నక్కవానిపాలెం మండల పరిషత్ పాఠశాలను మంగళవారం విశాఖపట్నం జోన్-1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. నక్కవానిపాలెం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్బవరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిఇఒ ఎం.వెంకట లక్ష్మమ్మ, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, బిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నారాయణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు జన్మదిన వేడుకలు సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరుబిల్లి పరి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డుకి సంబంధించిన రూలర్ బెండ్జు పది, గ్లౌజులు 100, కాటన్ వన్ యూనిట్ ఎన్టీఆర్ హాస్పిటల్ డాక్టర్ జి.కృష్ణ, టీడీపీ నాయకులు కర్రి చిన్న అప్పలనాయుడు చేతుల మీదగా సిబ్బందికి అందించారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు మినిమం పెన్షన్ రూ.9000 ఇవ్వాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వివికె రాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వై విజయ్ కుమార్ మీటింగ్ హాల్లో మంగళవారం జరిగిన అసోసియేషన్ అనకాపల్లి డిపో అధ్యక్షులు విత్తనాల పోతురాజు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నిత్యవసర ధరలు వైద్య ఖర్చుల దష్టిలో పెట్టుకొని మినిమం పింఛను 9000 ఇవ్వాలని దానితో పాటు డిఏ, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిహెచ్ పైడ్రాజు రెడ్డి, రాజాన దొరబాబు, ఏవి రావు, ఎంవివి సత్యనారాయణ, మామిడి విష్ణు, డి లక్ష్మణరావు, బుగత శంకరరావు, ఆనందరావు, పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్‌వై. అగ్రహారంలో సర్పంచి కన్నూరు నాగభూషణం, ఉపసర్పంచి లెక్కల అచ్చిబాబు ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శి, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో మంగళవారం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బుచ్చయ్యపేట : ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బిడి గ్రామంలో మంగళవారం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. పలు వీధులలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, సర్పంచ్ పెడిరెడ్ల మాణిక్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరటి సాగుగా డ్రాగన్ ఫ్రూట్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదికి చెందిన ఏలిశెట్టి ఈశ్వరరావు తన పెరటిలో డ్రాగన్ ఫ్రూట్‌ను పెంచుతున్నారు. ఒకప్పుడు ఇతర దేశాల నుండి దిగుమతి అయ్యే ఈ డ్రాగన్ ఫ్రూట్‌ను మన ప్రాంతంలోనూ సాగు అవుతుంది. అధిక పోషకాల, రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఈ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఒక్కరు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఫ్రూట్‌ను మిద్దె సాగుగా చేపట్టడం వల్ల ఉపయోగం వుంటుందని కెఎంఎం అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఈశ్వరరావు తెలిపారు.

పెరటిలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ మొక్క

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి చదువులవారి వీధికి చెందిన 19 సంవత్సరాల యువతీపై అత్యాచారానికి పాల్పడిన ఆరుగురు దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక కర్షక నిలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన స్నేహితులతో కలిసి సింహాచలం వెళ్లి తిరిగి వస్తున్న యువతిని కిడ్నాప్ చేసి ఆరుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. చదువుకున్న వయసులో పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడి గంజాయి, మద్యం మత్తులో విచక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు ఆగటం లేదని, ఆరు నెలల బాలిక నుండి 60 సంవత్సరాల ముసలివారి కూడా వదలట్లేదని పేర్కొన్నారు. దీంతో ఆడపిల్లల్ని బయటికి పంపించాలంటేనే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. నిర్భయ చట్టాన్ని ప్రతిష్ఠంగా అమలు చేయట్లేదని, నిందితులు బెయిల్ మీద బయటకు వచ్చి దర్జాగా తిరుగుతున్నారని తెలిపారు. నిందితులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షలు వెంటనే పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన హోం మంత్రి దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. బాధిత యువత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు జి.సుభాషిని, యు.నాగమణి, పార్వతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

కత్తితో అత్తామామలపై దాడి

- అత్త అక్కడికక్కడే మృతి
- తీవ్ర గాయాలతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మామ

ప్రజాశక్తి-చోడవరంరూరల్ : భార్యను కాపురానికి పంపించలేదని కోపంతో అత్తమామలపై కత్తితో దాడి చేసిన సంఘటన చోడవరం మండలం అడ్డూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనలో అత్త మృతి చెండగా, మామ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని అడ్డోడు గ్రామానికి చెందిన సానబోయిన లక్ష్మి, పైడిరాజుల కుమార్తెను మామిడి పైడి నాయుడు కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కారణంతో కొద్ది కాలం నుంచి తరచూ గొడవలు పడుతున్నారు. దీంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో భర్త పైడినాయుడుపై గతంలో కేసు నమోదైంది. దీనంతటికీ అత్తమామలే కారణమని, భార్యను కాపురానికి పంపించలేదని కోపంతో పైడినాయుడు వారిపై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ఉద్దేశంతో మంగళవారం అత్తని కత్తితో అతికిరాతకంగా నరికాడు. అడ్డుకోబోయిన మామపైనా దాడి చేశాడు. ఈ దాడిలో అత్త లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, మామ పైడిరాజు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో బంధువులు పైడిరాజును విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ తెలిపారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-అనకాపలి

రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు అన్నారు. అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ హక్కులు అమలు కాకపోతే ప్రశ్నించడం ద్వారా అవగాహన కల్పించుకోవచ్చిని చెప్పారు. అనంతరం కాలనీవాసులు తాగునీటి సమస్యను వివరించారు. అంబేద్కర్ లైబ్రరీ కట్టుకునే విధంగా సహాయం అందించాలని కోరారు. దీనిపై ఇంచార్జ్ తహశీల్దారు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ త్వరలో సమస్యను పరిష్కరిస్తామని, లైబ్రరీ కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సాలపు కనకరాజు, ఈవోపిఆర్‌డి ధర్మారావు, ఆర్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, మాజీ ఎంపీటీసీ రేబాక ప్రసాద్, జై భీమ్ సేన సెక్రెటరీ కే రాము, వీఆర్వో రాజు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎన్‌జీ పాలెంలో మంగళవారం పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో అందరూ సమానంగా ఉండాలని కులంపై వ్యతిరేకం ఉండకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి సోమరాజు, హాస్టల్ వెల్ఫర్ అధికారి నిర్మల, ఏఎస్ఐ కె.దొర, పంచాయతీ కార్యదర్శి డి.బాబురావు గ్రామస్తులు పాల్గొన్నారు.

1న రంగసాయి నాటక సంఘం వార్షికోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నాటక రంగ ప్రోత్సాహమే లక్ష్యంగా పయనం సాగిస్తున్న రంగసాయి నాటక సంఘం 14వ వార్షికోత్సవాన్ని ఆగస్టు 1న నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటక పరంపరలో వెండి తెరకే ఆభరణంగా వెలుగొందుతున్న రంగస్థల నటులు, రచయిత, దర్శకులు తనికెళ్ల భరణికి రంగసాయి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రంగస్థల ప్రముఖులను మరో ఐదుగురిని ఎంపిక చేసి రంగసాయి థియేటర్ అవార్డును ఈ సంవత్సరం నుండి అందజేయనున్నామన్నారు. ఆ తొలి పురస్కారాలను ప్రముఖ దర్శకుడు ఎస్ఎం.బాషా, యువ నటుడు వి.సతీష్ కుమార్, నాటక ప్రోత్సాహకుల పరిషత్తు నిర్వహకులు బుద్ధాల వెంకట రామారావు, పౌరాణిక రంగస్థల నటీమణి కె.మంగాదేవి, అతిపిన్న వయసు నుండి పౌరాణిక పాత్రలను ధరించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొంది ప్రభుత్వ నంది పురస్కారాన్ని అందుకున్న చిరంజీవి బగాది రితిష్ చంద్‌లకు ఈ అవార్డును ఇవ్వనున్నట్లు తెలిపారు. బాల బాలికలచే 'సంక్షిప్త భారతం' అనే పౌరాణిక ఏకపాత్రల ఏకాంకికను ప్రదర్శింపజేస్తున్నామన్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్.శివజ్యోతి, రవి బ్రహ్మ, నవరసమూర్తి పాల్గొన్నారు.

కొత్త మహాలక్ష్మి అమ్మవారికి పంచకర్ల పూజలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు అజనగిరి గ్రామంలో కొత్త మహాలక్ష్మి అమ్మవారికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి మహోత్సవానికి ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కల్లేపల్లి ఎర్నిబాబు, బొడ్డపల్లి సూరిదేముడు, శ్రీనివాసరావు, శంకర్, ప్రసాద్, దేవా, కాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దే అందజేయనున్నట్లు తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ సచివాలయం సిబ్బంది ఉదయం 6 గంటలకు ప్రారంభిస్తారని, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు. వికలాంగులకు రూ.6వేలు చొప్పున అందిస్తారని చెప్పారు. లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా ఆగస్టు ఒకటి, రెండు తేదీల్లో తప్పనిసరిగా ఇంట్లో వద్ద ఉండి పింఛన్ తీసుకోవాలని మురళి కోరారు.

బొడ్డేడ మురళి

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని ఆరబుపాలెం గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుండి అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ఆడారి శ్రీకాంత్, కోశాధికారి ఎల్లపు సంతోష్ కుమార్, కొయిలాడ గంగాధర్, దాడి అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్టబద్ధ దత్తతలను మాత్రమే ప్రోత్సహించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చట్టబద్ధ దత్తతలను మాత్రమే ప్రోత్సహించేందుకు యావత్తు సమాజం పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, కింగ్ జార్జి ఆసుపత్రి సంయుక్తంగా మంగళవారం కెజిహెచ్ ఎథిక్స్ గ్యాలరీలో అనధికార దత్తతలు, చట్టప్రకారం చర్యలు పేరిట గైనకాలజీ, పిల్లల విభాగం వైద్యులు, నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధ, ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ పి.శివానంద, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జయదేవి, ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాస్ కుమార్, ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ ధవళ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కల్టివేటింగ్ స్టార్టప్ సక్సెస్ స్టోరీస్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ ఇంక్యుబేటర్ కల్టివేటింగ్ స్టార్టప్ సక్సెస్ స్టోరీస్" పేరుతో మంగళవారం దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. యువ నిపుణులను ప్రేరేపించడం, సాధికారత కల్పించడం ఈ సదస్సు లక్ష్యమని ఐఐసీ అంబాసిడర్ ఎమ్మార్ వివిఎస్‌జి గుప్తా తన కీలక ఉపన్యాసంలో పేర్కొన్నారు. వర్ధమాన ఇంజనీర్ నుండి విజయవంతమైన స్టార్టప్ స్థాపకుడి వరకు విశేషమైన ప్రయాణంపై తన ఉపన్యాసంలో సవాళ్లు, అవకాశాలు వ్యవస్థాపక స్ఫూర్తిని నిర్వచించే ఆవిష్కరణలను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్. ఆర్ వైకుంఠ రావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి భార్గవి, ఆర్ అండ్ డి కన్వీనర్ డాక్టర్ ఏ నళిని కుమారి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ రమణ కుమార్ జోగ, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ వివి ప్రసన్నకుమార్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల కౌన్సిలర్లు

రావణాపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి కృషి

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న

రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్ ను శాశ్వత ప్రాతిపదిక కింద దశలవారీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలో రావణాపల్లి రిజర్వాయర్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ముందుగా పది రోజుల క్రితం రిజర్వాయర్కు గండి పడిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. గండి పడిన ప్రాంతం వద్ద మరమ్మతుకు, గబ్బాడ వైపు వెళ్లే కాలువకు సంరక్షణ గోడల ఏర్పాటు నిమిత్తం ఇరిగేషన్ అధికారులను అంచనా ప్రణాళిక వేసి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రిజర్వాయర్ గర్భంలో ఇనుప కంచెను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ ఇఇ స్వామి నాయుడును ఆయన ఆదేశించారు. రిజర్వాయరును రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేశామని దానికి ఆటంకం కలిగించే ఎటువంటి పనులను అధికారులు ప్రోత్సహించకూడదని అన్నారు. సాగు రైతుల కోరిక మేరకు రిజర్వాయర్ గర్భంలో వేసవికాలంలో పూడికతీత పనులు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రావణాపల్లి రిజర్వాయర్కు పొర్లుకట్టు మధుం, లీకేజీల మరమ్మతులకు అధికారులకు అంచనా వేయమని ఆదేశించామన్నారు.వెంటనే నిధులను కేటాయించి తక్షణమే పనులు పూర్తి చేయిస్తామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో 8 సంవత్సరాల క్రితం ఎన్ టి పి సి కంపెనీ నుంచి కోటి 80 లక్షల నిధులను తీసుకొచ్చి రిజర్వాయర్ గర్భంలో పూడిక తీయించామని, రానున్న వేసవిలో ఏదో ఒక కంపెనీ నుండి నిధులు తీసుకువచ్చి పూడిక పనులు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, ఇరిగేషన్ ఈఈ జె.స్వామినాయుడు, ఎఇ సూర్యనారాయణ, డిప్యూటీ తహసిల్దార్ రాజ్ భరత్, ఎస్సై కృష్ణారావు, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లు సత్తిబాబు, మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ పాల్గొన్నారు.

పాఠశాలకు అయ్యన్న ఆర్థిక సాయం

నర్సీపట్నం బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యుత్ మరమ్మతులకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.1.50లక్షల ఆర్థిక సాయంను మంగళవారం అందజేశారు. పాఠశాలలో కొన్ని రోజులుగా కేబుల్ మరమ్మతులతో విద్యార్థుల అవస్థలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ప్రిన్సిపాల్ అయ్యన్న దృష్టికి తీసుకువెళ్లారు. తాను రూ.1.50లక్షలు అందజేస్తానని, మిగిలిన నిధులు సొసైటీ నుంచి తీసుకుని, పనులు పూర్తి చేయాలని అయ్యన్న ఆదేశించారు.

క్రీడాకారులు మరింతగా రాణించాలి

నర్సీపట్నం టౌన్:పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశం నుంచి ఆడుతున్న క్రీడాకారులు మంచి విజయాలు సాధించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. మంగళవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ క్రీడా అధికారి రమణ సమక్షంలో పారిస్ ఒలింపిక్ 2024 చీర్ ఫర్ భారత్ సెల్ఫీ పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఒలింపిక్స్ వంటి వేదికల్లో మన దేశం తరపున ఆడుతున్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. శానిటేషన్ పనుల నిర్వహణలో పలు అక్రమాలు జరిగాయని టీడీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. దీంతో, ఇరువురు కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. . రూరల్ సిఐ హరి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలు, 15 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వర్తించడం గమనార్హం.

విదేశీ ఉద్యోగాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న న్యాయవాది

ప్రజాశక్తి - మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖ న్యాయవాది శ్రీనాథుం శ్రీనివాసరావు మాట్లాడుతూ, అవయవాలు అమ్ముకోవడానికి, సెక్స్ వర్కర్లుగా చెయ్యడానికి ఎక్కువగా మానవ అక్రమ రవాణా జరుగుతుందన్నారు.ఎవరైనా మీకు ఉద్యోగం ఉంది లేదా మంచి జీతం ఉంటుందని చెపితే నిర్ధారించుకుని నమ్మాలన్నారు.విదేశాలలో ఉద్యోగం అంటే ముందుగా మన విదేశాంగ శాఖ వారిని సంప్రదించాలని, ఈ విషయమై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దామోదర నాయుడు, పెద్దలు దంగేటి సూర్యారావు, కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

రూ.50 వేల చెక్కు అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ 4వ వార్డులో సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణలో గాయపడ్డ వైసిపి కార్యకర్త రౌతు జగదీష్‌కు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రూ.50వేల ఆర్థిక సాయం చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, వైసిపి కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైసిపి టౌన్ అధ్యక్షులు ఏకా శివ, వార్డు కౌన్సిలర్ దాడి బుజ్జి, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి- కోటవురట్ల: పారిశుధ్య వారోత్సవాలు, పక్షోత్సవాలు అంటూ జిల్లా, మండల స్థాయి అధికారులు ఫోటోలకు మాత్రమే పరిమితం అవుతుండటం పట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోటవురట్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద పారిశుధ్య పనులను మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ పరిశీలించారు. కోటవురట్ల సీతారామరాజు నగర్ వద్ద మూడు నెలల క్రితం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పరిశీలించారు. మంగళవారం ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ పరిశీలించేందుకు రావడంతో స్థానికులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రావటం ఫోటోలు తీసి వెళ్లిపోవడమేనా పరిష్కరించింది ఏమైనా ఉందా అని నిలదీశారు. సీతారామరాజు నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదురుగా కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో దుర్గంధంతో పాటు దోమలు బెడదతో దాదాపు నాలుగు సంవత్సరాలుగా అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు.

రుచికరమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందజేయాలని డిప్యూటీ విద్యాశాఖ అధికారి పి.అప్పారావు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని జల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందజేయాలని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల లైసెన్సులను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించిన కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేయాలని, సక్రమంగా పర్యవేక్షించని మున్సిపాల్ ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్.గౌరి, అప్పారావులు మున్సిపాలిటీలోని బలిఘట్టం, గవరవీధి అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించారు. అనంతరం అడిగర్ల రాజు మాట్లాడుతూ బలిఘట్టం అర్బన్ హెల్త్ సెంటర్ స్టోర్ రూమ్, వార్డు ఇతర రూమ్‌లు బారీగా కారుతున్నాయన్నారు. కరెంట్ వైరింగ్ సక్రమంగా లేదని, లక్షల విలువైన ల్యాబ్ టెక్నీషియన్ మిషన్లు ఉన్నా కరెంట్ సౌకర్యం లేక ఉపయోగించ లేని పరిస్థితి ఉందన్నారు. వాటర్ పైపులు సక్రమంగా లేవని, ల్యాబ్, మరుగుదొడ్ల అవసరాలకు నీరు పంపిణీ లేదన్నారు. అలాగే వర్షాకాలంలో రోగులు, అంబులెన్స్ వెళ్లడానికి అవకాశం లేదన్నారు. ఆసుపత్రి ఎదుట ఇరిగేషన్ కాలువ మురుగు నీటితో నిండి ఉందని చెప్పారు. ఆసుపత్రికి ప్రహరీ గోడ లేక బహిర్భూమిగా మారిందన్నారు. గవరవీధి అర్బన్ హెల్త్ సెంటర్ కూడా ఇదే దుస్థితి నెలకొందన్నారు. మీటింగ్ హల్ బోర్ రంధ్రము ఉందని, అలాగే ల్యాబ్, స్టోర్ రూమ్‌లలో మందులు, కెమికల్స్ నిల్వ ఉంచడానికి సరైన కరెంట్, ఇన్వేటర్లు సౌకర్యం లేదన్నారు. వీటిపై మున్సిపల్ కమిషనర్, జిల్లా వైద్యాధికార్లు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

భవనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -నక్కపల్లి:బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పెదబోదుగల్లం హైస్కూలు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పెదబోదు గల్లం లో హెచ్ఎం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్ఎవిఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు తదితర ఉపాధ్యాయులతో కలిసి బాల్య వివాహల అరికట్టడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో ప్లకార్డులు పట్టుకుని తిరుగుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆడపిల్లలను చదివించి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటును అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహం చేయడంతో బాలికల జీవితం నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, చిన్నారావు, రమేష్ బాబు,శ్రీదేవి పాల్గొన్నారు .

ర్యాలీ చేపడుతున్న ఉపాధ్యాయులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మాడుగుల: నర్సీపట్నంలో డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహించే సీపీఎం అనకాపల్లి జిల్లా మహ సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు గండి నాయనబాబు, వెంకన్న పిలుపు నిచ్చారు. మంగళవారం మాడుగుల మండలంలోని ప్రచారం నిర్వహించి మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అధ్యక్షతన తాటిపర్తిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సిపిఎం పోరాటాలు నిర్వహించిందన్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని లేటరైట్, అక్రమ మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున దీర్ఘకాలిక పోరాటం చేశామన్నారు. అనేక భూపోరాటాలు నిర్వహించి గిరిజనులు, పేదలు తరపున నిలబడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె భవాని, పాంగి మత్స్యరాజు, కేశవరావు, నెల్లూరు కృష్ణ కోర్రా రాములమ్మ, మువ్వల కొండమ్మ, కిల్లో రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

5న నూకాలమ్మ భూముల వేలం పాట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి దేవుని మాన్యం కు ఆగస్టు 5వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ తేజ తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కొత్త మల్లంపేట రెవెన్యూ పరిధిలో ఉన్న 15 ఎకరాల 33 సెంట్లు భూమికి ఆరు సంవత్సరాలు కౌలు నిమిత్తము లింగంపేట గ్రామంలో నూకాలమ్మ అమ్మవారి దేవాలయం వద్ద వేలంపాట నిర్వహిస్తామన్నారు. ధరావత్తు 5000 రూపాయలు చెల్లించి రైతులు వేలంపాటలో ఆగస్టు 5వ తేదిన ఉదయం 10 గంటలకు నూకాలమ్మ దేవాలయం వద్దకు హాజరు కావాలని ఆమె కోరారు.

శాకాంబరిగా మోదకొండమ్మ

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మోదకొండమ్మను మంగళవారం శాకాంబరి అవతారంలో అలంకరించారు. మాడుగుల మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులతో అమ్మవారిని అలంకరించి భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు నిర్వహించారు.

పాఠశాలకు హ్యాండ్ మైక్ సెట్ వితరణ

మైక్ సెట్ ఇస్తున్న కాసులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి పిక్కి కాసులు హ్యాండ్ మైక్ సెట్ బహూకరించారు. పిక్కి కాసులు ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి విజయవాడలో సిఆర్‌పిఎఫ్ గా విధులు నిర్వహిస్తున్నారు. హ్యాండ్ మైక్ సెట్ ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నారాయణరావుకు అందజేశారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలిగి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డివి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

-గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:కొత్త జాబ్ కార్డులు ఇచ్చి ఉపాధి హామీ పనులు కల్పించాలని రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ కొరుప్రోలు గ్రామానికి చెందిన ఆదివాసీ కొందు గిరిజనులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 10 కుటుంబాల ఆదివాసి కొందు గిరిజనులు జీవనం సాగిస్తున్నామన్నారు. కొరుప్రోలు గ్రామం నుండి పంచాయతీ కేంద్రానికి రోడ్డు సౌకర్యం లేదని, మూడు కిలోమీటర్లు కాలినడకన రావాల్సి ఉందన్నారు. కొండ శివారు వద్ద నివసిస్తున్న కొంత మందికి గతంలో ఐదు కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇచ్చారన్నారు. గ్రామంలో పని ఇవ్వకుండా పంచాయతీ కేంద్రంలో కల్పించడంతో రాను పోను ఆరు కిలోమీటర్లు వెళ్ల లేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఉపాధి హామీ పథకం పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జాబ్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గెమ్మిల సుబ్బారావు, ఎం.కొండబాబు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- కార్మిక శాఖ మంత్రి సుభాష్‌కు సిఐటియు వినతి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కుమార్, తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మేఘాలయ హోటల్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికుల సమస్యలపై వివిధ సంఘాల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అందులో భాగంగా సిఐటియు నుంచి కుమార్ నేతృత్వాన ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని మంత్రికి అందజేసింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 1265 రోజుల నుంచి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన జరుగుతోందని తెలిపారు. ఎన్నికల సందర్భంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. దాన్ని నెరవేర్చుకోవాలని కోరారు. తక్షణం స్టీల్‌ప్లాంట్‌కు కావలసిన రూ.5 వేల కోట్లును కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా మంజూరు చేయాలన్నారు. అదే విధంగా బ్యాంకుల నుండి అప్పు తెచ్చుకొనేందుకు యాజమాన్యానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులకు ప్రతి నెలా 1న జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన పిఎఫ్, త్రిఫ్ట్, ఇన్స్యూరెన్స్ సొమ్మును ఆయా ట్రస్టులకు జమచేయాలన్నారు. కనీస వేతనం జివోలు సవరించాలని, విశాఖలో లేబర్ కోర్టులో జడ్జిల నియామకం చేపట్టాలని కోరారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను తక్షణం విశాఖలో నియమించాలన్నారు. గత ప్రభుత్వ హాయాంలో భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే, నాలుగు కార్మిక సంఘాల సమక్షాన జ్యూట్‌మిల్ కార్మికులు 4,800 మందికి ఫైనల్ సెటిల్‌మెంట్ అగ్రిమెంట్ జరిగిందన్నారు. వారిలో దాదాపు వెయ్యి మందికి ఫైనల్ సెటల్‌మెంట్ ఇవ్వలేదన్నారు.

గంగవరం పోర్టు యాజమాన్యం కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శిని విధుల నుండి తొలగించిందని, వెంటనే పనిలో పెట్టుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కీం వర్కర్లను పర్మినెంట్ కార్మికులుగా గుర్తించాలన్నారు. మోటారు ట్రాన్స్‌పోర్టు చట్టం 2019ను రద్దు చేయాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జిని మరమ్మతు కోసం సుదీర్ఘకాలం మూసివేస్తున్నారని, దీనివల్ల సుమారుగా 50 వేల మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సుబ్బారావు, వెంకటరావు, తులసీరాం ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వినతి

మున్సిపల్ కార్మికులకు ఎంటిఎస్ వేతనాలు చెల్లించాలని మంత్రి సుభాష్‌కు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు విజ్ఞప్తి చేశారు.





అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి వరకూ..

సృజనాత్మకత.. సమయ పాలన

-పనిచేసిన ప్రతిచోటా సిఇ రవికృష్ణరాజు కార్యదక్షతకు ప్రశంసలు

-రాయలసీమ, విశాఖలో కీలక బాధ్యతలు

-నేడు ఆయన ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో'ఇంజినీర్లు సమస్యలను వివిధ కోణాల్లో చూడగలగాలి. సృజనాత్మక పరిష్కారాలను కనుగొనాలి' - అలాంటి వారు ఏ ప్రాజెక్టును చేత పట్టినా మంచి ఫలితాలు సాధిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అందుకు మంచి ఉదాహరణగా జివిఎంసి చీఫ్ ఇంజినీర్ పి.రవికృష్ణరాజును చెప్పొచ్చు. 37 ఏళ్ల పాటు రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు, అధోని, నంద్యాలలో వివిధ తాగునీటి ప్రాజెక్టుల విజయవంతం వెనక ఆయన కృషిని ఆయనకు సమకాలీనులైన ఏ ఇంజనీరును కదిపినా చెబుతారు. కడప జిల్లా పొద్దుటూరులో జన్మించిన పసుపర్తి రవికృష్ణరాజు 2021 నుంచి 2024 వరకూ జివిఎంసి చీఫ్ ఇంజినీరుగా విధుల్లో ఉంటూ బుధవారం ఉద్యోగ విరమణ చెందుతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటికి జివిఎంసిలో పెండింగ్‌లో ఉన్న సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డు, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు రోడ్డు విస్తరణ, అక్కయ్యపాలెం రోడ్డు, అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మారియట్ హోటల్ రోడ్డు, అనకాపల్లిలోని పెరుగు బజారు రోడ్డు, కె.నగరపాలెం రోడ్డు విస్తరణ పనులను ఎలాంటి ఆటంకాలూ లేకుండా పూర్తిచేసి రికార్డు నెలకొల్పారు. విశాఖ నగరంలోని పార్కులు, జంక్షన్‌లు, ఇండోర్ స్టేడియంలో దాదాపు 15 ఫౌంటైన్ల పనులు రవి కృష్ణరాజు పర్యవేక్షణలో పూర్తయ్యాయి.

రాష్ట్రంలో పలు చోట్ల అధికారిగా ఉత్తమ సేవలు

2017 నుంచి 2021 వరకూ నెల్లూరు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్లలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసిన రవి కృష్ణరాజు 2021లో విశాఖ జివిఎంసికి విచ్చేశారు. రాయలసీమలో ఏ రకంగా తాగునీటి ప్రాజెక్టులకు కీలక డిపిఆర్‌ల తయారీలో ఉత్తమ కృషి చేశారో విశాఖ నగర నీటి ప్రాజెక్టులు, యుజిడి పథకం అమలులో అలానే పేరు తెచ్చుకున్నారు.

విద్యార్థి దశ నుంచీ సృజనాత్మక కృషి

చీఫ్ ఇంజినీరుగా బుధవారం రిటైర్ అవుతున్న రవి కృష్ణరాజు కడప జిల్లా పొద్దుటూరులో 1962లో జన్మించారు. 1977 ఎస్‌ఎస్‌సిలో పొద్దుటూరు టాపర్‌గా నిలిచారు. 1986 జెఎన్‌టియు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అనంతపూర్‌లో బిటెక్ విభాగంలో యూనివర్సిటీకే మొదటి ర్యాంక్‌ను సాధించారు. అనంతరం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నుంచి చీఫ్ ఇంజినీరు వరకూ చేపట్టిన బాధ్యతల్లో సమయపాలన, సమిష్టితత్వంతో ముందుకు సాగారు.